


# మనిషిలో మనిషి

—ఉమ

స్వప్నంలా సాగిపోతున్న మా సంసారంలో సుడిగాలిలా ప్రవేశించాడు సౌమిత్రి. ఆ సుడిగాలిలో అర్థం లేకుండా కొట్టుకు పోయింది నేను ఒక్కడినే. నీరజను నేను ప్రేమించి వివాహం చేసుకున్నాను. సౌమిత్రి మా ఇంట్లో అడుగు పెట్టే వేళకు మేము గడిపింది కేవలం నాలుగు సంవత్సరాల అన్యోన్య దాంపత్య జీవితం.

సౌమిత్రి నా చిన్ననాటి స్నేహితుడు. ఒక కంచంలో తిని, ఒక మంచంలో పడుకునే వాళ్ళు అంటారే—అలాంటి పరిపతికి చెందిన వాళ్ళం మే మిద్దరమూ. మా వయస్సు 20 సంవత్సరాలు దాటినాక మా దారులు వేర్వేరైనాయి. నేను ఎస్. ఎస్.సి. పూర్తి చేసి, స్టేట్సుకు వెళ్ళిపోయాను. ఆ తరవాత సౌమిత్రి ఏమైనాడో నాకు తెలియదు. అలాంటిది హఠాత్తుగా ఇంచుమించు పదిహేను సంవత్సరాల అనంతరం బజారులో కనిపించాడు. సౌమిత్రిని నేను గుర్తు పట్టలేకపోయాను.

"ఏమిటి, నందా? సౌమిత్రినే మరిచావా?!" అంటూ నవ్వుతూ గుర్తు చేశాడు. మనిషి చూస్తే మారిపోయింది. నవనవలాడుతూ, అందంగా ఉండే వాడు. అలాంటివాడు కొబ్బరి పీచులా భుజాల వరకూ వెంట్రుకలు పెంచాడు. దట్టంగా పెరిగిన గడ్డం, మీసాల మధ్య వాడి పెదవులు ఉండే తీరు కూడా నాకు సరిగ్గా కనుపించలేదు. ఇదంతా చాలదన్నట్లు కుడివైపు చెంప పై భాగంలో కత్తిలాంటి రెండు అంగుళాల నల్లని మచ్చ కొట్టవచ్చినట్లు కనుపించింది. మాసిపోయిన బట్టల్లో నవ్వుగా— సత్తువ లేనివాడిలా కనుపించాడు.

"ఏమిట్రా? ఇలా మారిపోయావేం?" అని బాధగా అన్నాను.

చిన్నవాడు ఎంత పోకు చేసుకునేవాడు! అద్దం ముందు అరగంటసేపు నిలబడి తల

ఆకర్షణీయంగా దువ్వుకునేవాడు. నవనాగరికంగా దుస్తులు వేసుకుని ఎంత దర్జాగా ఉండేవాడు!

“జీవితం నేర్పిన చేదు పాఠాలు, నేస్తం! చిన్న పిల్లలు నన్ను చూచి దడుసుకుంటున్నారట. దొబూచిలా ఉన్నాను కదూ?” అన్నాడు. వాడి బైరాగి రూపం చూచి నాకు జాలి వేసింది.

వాణ్ణి చూస్తూ ఉంటే ఎన్నో పాత జ్ఞాపకాలు నన్ను చుట్టుముట్టాయి.

“మా ఇంటికి పోదాం, పద” అంటూ ఆప్యాయంగా పిలిచాను.

నా ఆహ్వానం ఆవురు, ఆవురు మంటూ అందుకున్నాడు. బజారు దాటుకుని వస్తూ ఉంటే దారిలో జేబులు తడుముకుని, చిల్లర డబ్బులు పైకి తీసి మల్లెపువ్వులు కొన్నాడు. మల్లెపువ్వులు దోసిట పోసుకుని, వాటి సువాసన గట్టిగా పీలుస్తూ, “మీ ఆవిడకు!” అన్నాడు.

“నాకు ‘ఆవిడ’ ఉందని నీ కెలా తెలుసోయ్?” అంటూ సరదాగా నవ్వాను.

“ఇంతకూ పెళ్ళి అయిందా, లేదా?” కంగారుగా అడిగాడు.

“అయిందిలే. నాలుగు సంవత్సరాల క్రితం. నీరజ మొదట్లో ఆఫీసులో నా పి. ఎ. ఇప్పుడు నా జీవితంలో కూడా” అంటూ నీరజ గురించి ఇంకేదో చెప్పబోయాను. నా మాటలు పూర్తిగా వినకుండానే “అయితే నీది ప్రేమ వివాహం అన్నమాట!” అని తృప్తిగా నిట్టూర్చాడు సౌమిత్రి.

సౌమిత్రి గురించి కూడా నాకు ఎన్నో విషయాలు తెలుసుకోవా లనిపించింది.

“అది సరేకానీ, ముందు నీ విషయం చెప్పు. ఇంకా బ్రహ్మచారివేనా? లేక వివాహానంతరం సన్యాసం ఏదైనా పుచ్చుకున్నావా? ఈ బైరాగి వేషం ఏమిటి? ఏ వూళ్ళో ఉంటున్నావ్? ఏమిటి చేస్తున్నావ్?” అంటూ చనువుగా ప్రశ్నల వర్షం కురిపించాను. నేను వేసిన ప్రశ్నలకు నాకేసి చిత్రంగా చూచాడు.

“ఏమిట్రా ఆ చూపు?” అంటూ వాడి భుజం చరిచాను.

“నువ్వు అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పగలనా అని ఆలోచిస్తున్నాను” అన్నాడు.

“ఏం? చిక్కు ప్రశ్నలు వేయలేదుగా?” అంటూ నవ్వాను.

“ఏమిటో పది, పదిహేను సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు ఇప్పుడు పోయిన జన్మలా అనిపిస్తుందిరా! ఏం చేస్తున్నావని అడిగావు కదూ? దానికిమాత్రం జవాబు చెప్పగలను. అన్వేషిస్తున్నాను!” అన్నాడు.

“అన్వేషణా? దేనికోసం?” అని అడిగాను.

“ఒకప్పుడు నీతి—న్యాయమార్గం కొరకు అన్వేషించాను. అదంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఇప్పుడు నా అన్వేషణ సుకన్యకోసం!” గంభీరంగా అన్నాడు.

“సుకన్య ఎవరు?”

“సుకన్య...నా ప్రియురాలు. నా.....నా భార్య!” అంటూ ఆవేశంతో పొంగిపోయాడు.

“అయితే, పెళ్ళికూడా చేసుకున్నావన్న మాట!”

“ఎప్పుడో—పన్నెండు ఏళ్ళ క్రితం.”

“నిజం? ఏం, అంత తొందరగా చేసుకున్నావు?” అని అడిగాను.

“అంజెరిలా చెట్ల చుట్టూ పరుగెత్తుతూ, యుగళ గీతాలు పాడుకుంటూ ఉల్లాసంగా గడిపేందుకు వ్యవధి లేక. రోజులు లెక్క పెట్టుకుని బ్రతికే వాళ్ళకు తొందర ఏమిటి? కొన్ని విషమ పరిస్థితుల్లో నేనూ, సుకన్యా కలుసుకున్నాము. రోజు రోజుకు ఆయుష్షు తగ్గిపోతున్నదని త్వరపడి పెళ్ళి చేసుకున్నాము. ఆయుష్షు నిలబడింది కానీ, మేమే విడిపోయాము.” భారంగా అన్నాడు సౌమిత్రి.

“ఆప లేం జరిగింది?” కుతూహలంగా అడిగాను.

“1965—70 లో నక్సలైటు గొడవలు జరిగాయి. గుర్తుందా?” అన్నాడు.

నాకు అంతా గుర్తుకు వచ్చింది. సౌమిత్రి ఆ రోజులలో ‘మార్క్సిజమ్’ కాచి వడపోయడం మొదలు పెట్టాడు. లెనిన్ గురించీ, మావో గురించీ ఉపన్యాసాలు ఇచ్చేవాడు. వ్యాసాలు వ్రాసేవాడు. చదువు మానుకున్నాడు. ఆ తరవాత వూళ్ళో నుంచే అదృశ్యమైపోయాడు.

“నువ్వు వాళ్ళలో చేరావా?” అని అనుమానంగా అడిగాను.

నా ప్రశ్నకు జవాబుగా “శ్రీకాకుళం వెళ్ళాను” అన్నాడు.

“సుకన్య కామ్రేడ్ రామారావు కుమార్తె. మా కోసం ప్రాణాలు తెగించేది. కొన్ని కొన్ని సమయాల్లో చీకటిలో, చెట్లచాటున ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, నిముషాలు లెక్కపెట్టుకుంటూ గడిపేవాళ్ళం. ఆ పరిస్థితుల్లో సుకన్య స్పర్శ పన్నీటి జల్లు, పైరు గాలిలా హాయిగా ఉండేది. దూరంగా ఉందా అనుకుంటూనే దగ్గరైనాము. దగ్గరైన కొలదీ దూరం అయిపోతామనే భయంతో ఒకరిలో ఒకరం లీనమైపోయేవాళ్ళం. మా వివాహం వెంటనే జరిగిపోయింది. అయిదారు నెలలు భార్యాభర్తల్లా జీవించాము. తరవాతే పోలీసు కాల్పులు జరిగాయి. అప్పుడు నాకు బాగా దెబ్బలు తగిలాయి. ఆ తరవాత ఏం జరిగిందో





స్థాపితం: 1957 ఫోన్ నెం. 846188

మీరు మీ ఇంటియందుండే తపాల ద్వారా చిత్రకళ నేర్చుకొని రెండు సంవత్సరములలో ఉత్తమ చిత్రకారులు కావచ్చును.

యావద్భారత దేశము నుండియు, విదేశముల నుండియు అనేక మంది మన విద్యాలయములో విద్యార్థులుగా చేరి ఉత్సాహముతో శిక్షణ పొందుచున్నారు.

మీరు కూడా ఈ సులభ పద్ధతులతో చిత్రకళ నభ్యసించుటకు సమ్మతించుచున్నారా? వివరముల కొరకు తొమ్మిది పైసల స్టాంపులను పంపండి.

**SANTHANU's CHITIRA VIDYALAYAM,**
**C/o CHITIBAKULLAN,**
**179, Singanna Chetty Street,**
**Chintadripet, Madras - 600 002.**

Arjee

5 సంవత్సరాలు గ్యారంటీ గల మెరీ సూపర్ స్పెషల్ బంగారు కవరింగ్ నగలను 15 సంవత్సరాల పరిశోధన ఫలితంగా – భారత దేశంలో ప్రప్రథమంగా తయారు చేస్తూ, దేశమంతటా విరివిగా వి. పి. పి. ద్వారా పంపే సంస్థ. ఉచితంగా కేటలాగ్ పొంది అన్ని వివరాలు చూడగలరు. అందులోని సంఖ్యలు సూచిస్తూ, ఉత్తరం రాస్తే, వి. పి. పి. ద్వారా వస్తువులు పంపబడతాయి. (వి. పి. పి. చార్జీలు అదనం)



**MERI GOLD COVERING WORKS.** (Estd: 1953)
**P.O. BOX 1405, 14, RANGANATHAN STREET**
**T. NAGAR MADRAS-600 017 INDIA**

సరిగా చెప్పలేను. రెండు, మూడు సంవత్సరాలు నా స్నేహితులు నాకు ప్రాణం పోసి రక్షించారు. నేను పూర్తిగా కోలుకున్నాను. సుకన్యకోసం ఎన్నోచోట్ల విచారించాను. సుకన్యను పోలీసులు పట్టుకున్నారని తెలిసింది. ఏ జైలులో పెట్టి నిర్బంధించారో తెలియు లేదు. పోలీసుల బారి నుండి తప్పించుకుని పారి పోయిందని కొందరన్నారు. కానీ, ఎటు వెళ్ళిందో, ఎక్కడికి వెళ్ళిందో ఎవరికీ తెలియదు. మా జీవితాలు మాత్రం సమాంతర రేఖల్లా మిగిలిపోయాయి" అంటూ తన కథ క్లుప్తంగా ముగించాడు సౌమిత్రి. వాడి కథ వింటూ ఉంటే నా గుండెలో కలుక్కు మంది.

"సుకన్య నీ కోసం బ్రతికే ఉండాలని కోరుకుం టున్నాను!" మనసారా అన్నాను.

"బ్రతికే ఉంది! నాకోసం ఎదురుచూస్తున్నది!" పొంగుతున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగు కుంటూ అన్నాడు.

ఆ తరవాత నాకు ఏమీ మాట్లాడా లనిపించ లేదు. మౌనంగా అడుగులు వేస్తూ మా ఇల్లు చేరుకున్నాము.

స్వర్గసీమలా ఉందనుకుంటూ గర్వపడిపోతున్న నా గృహంలోవాడు పెట్టిన పాదంతో ప్రళయం ప్రారంభమైందని నా కా క్షణం అర్థం కాలేదు.

నీరజ నా రాకకోసం ఎదురుచూస్తున్నట్లు వీధి తలుపులు తెరిచే ఉంచింది. సౌమిత్రిని ముందు గదిలో కూర్చోపెట్టి, నీరజను వెతుక్కుంటూ లోనికి వెళ్ళాను. నీరజ స్నానం చేస్తున్నది. అతిథిని తీసుకు వచ్చానని వార్నింగ్ ఇచ్చి వచ్చి సౌమిత్రికి ఎదురుగా కూర్చున్నాను.

సౌమిత్రి 'నేను—నీరజ' కలిసి తీయించుకున్న ఫోటో కేసి దీర్ఘంగా చూస్తున్నాడు. ఆ గదిలో నిశ్శబ్దం భరించరానిదిగా ఉంటే — "పెళ్ళయ్యాక తీయించుకున్నాం. ఆ రోజు—" అంటూ ఫోటో గురించి ఏదో చెప్పబోయాను.

సౌమిత్రి నా కళ్ళలోకి గుడ్లు పెద్దవి చేసి క్రూరంగా చూశాడు. వాడికి బాగా చెమటలు పట్టాయి. వాడిలో వస్తున్న మార్పుకి భుజం మీద చేయి వేసి, "సౌమిత్రీ!" అనబోయాను.

నా చేయి విసిరి కొట్టి, "మిత్రద్రోహి!" అంటూ గట్టిగా అరిచి, తూలుతూ పైకి లేచి నిల బడ్డాడు. ఏదో పూనకంలో ఉన్నవాడిలా ఊగిపోతూ, "తనే — తనే నా సుకన్య!!" అంటూ ఫోటో కేసి చూపిస్తూ అన్నాడు.

నా నెత్తిమీద పిడుగు పడినట్లయింది.

"వ్వా...వ్వాట్?!"

నా ప్రపంచం ఒక్కసారి తలకిందులైంది. భూమి గిరగిరా తిరుగుతున్నట్లనిపించింది. కళ్ళు బైర్లు కమ్మాయి.

ఆ తరవాత క్షణాలే గడిచాయో, నిమిషాలే గడిచాయో చెప్పలేను. అచేతనంగా మిగిలిపోయాను.

నీరజ స్నానం చేసి ఎప్పుడు బయటికి వచ్చిందో నీరు కారిపోతున్నట్టు వెంట్రుకలను చేతులతో పిండుతూ సరదాగా నా మీద విరజల్లింది. నీటి జల్లుకు ఉలిక్కి పడ్డాను.

నా ఉలికిపాటుకు పసిపిల్లలా నవ్వింది నీరజ,

నేను చుట్టూ భయంగా కలియ చూశాను.

"ఇదేమిటి?? వీధి తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి! ఏడీ వచ్చిన అతిథి?" అని అడిగింది నీరజ.

సౌమిత్రి ఎక్కడా కనిపించలేదు.

"ఏమిటి, నందా? ఏమైంది?" నా కుర్చీ వెనక నిలబడి నా మెడ చుట్టూ చేతులు వేసి ఆప్యాయంగా అడుగుతున్న నీరజ కళ్ళలోకి దీర్ఘంగా చూశాను.

భగవంతుడా! ఏమి టిదంతా?

సౌమిత్రి చెప్పింది నిజమేనా? కాదని ఎలా అనగలను?

ప్చ్! నీరజ గురించి నిజంగా నాకు తెలిసిన దెంత?

గడిచిన సంఘటనలు ఒకటీ, ఒకటీ నా కళ్ళ ఎదుట కదలాడాయి.

* * *

కెమికల్ ఇంజినీరింగులో డాక్టరేట్ పుచ్చుకుని, అమెరికాలో కొంత అనుభవం సంపాదించి, స్వదేశం తిరిగి వచ్చాను. నాకు మంచి ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం దొరికింది. అది ఆఫీసులో మొట్టమొదటి రోజు. మా కంపెనీ డైరెక్టర్ రాజారావుతో ఆఫీసు విషయాలు మాట్లాడుతున్నాను. అతను నీరజ కోసం బెల్ నొక్కాడు.

మొట్టమొదటిసారిగా నా జీవితంలోకి ప్రవేశించింది నీరజ.

బాగా నూనె పెట్టుకుని అట్టలా దువ్వుకున్న వెంట్రుకలను బిర్రుగా జడ వేసి, చక్రంలా చుట్టి బుచ్చడి వేసింది. నూనె కారిపోతున్న నుదుటి మీద రూపాయి కాసంత కుంకుమ బొట్టు పెట్టుకుంది. పాత కాలం ముసలి వాళ్ళు పెట్టుకునే ఫ్రేములో చేయబడ్డ కళ్ళజోడు ముక్కు మీదికి జారి ఉన్నాయి. షర్టులా వదులుగా ఉన్న జాకెట్టు పైన ముతకరంగు మందపు చీరె కట్టుకుంది. ఆరు అంగుళాల పెన్సిల్ ఒకటి చెవిలో దూర్చుకుని కళ్ళ జోడుపై నుంచి నన్ను గుడ్లు తిప్పి ఎగా దిగా చూస్తూ లోనికి ప్రవేశించింది నీరజ.

నవనాగరికంగా ఉన్న ఆ ఆఫీసు గదిలో పురాతనంగా ఉన్న నీరజ రూపం అపస్వరం పలికినట్లైంది. నీరజను చూస్తూ ఉంటే నాకు నవ్వు వచ్చిన మాట నిజం.

నా ముఖం ఎన్నో రకాల భావాలతో అష్టవంకరలూ తిరిగి పోతూంటే, "షి ఈజ గోయింగ్ టు బి యువర్ పి. ఎ." అన్నాడు రాజారావు.

"వ్హాట్? !" అని అదిరి పడ్డాను.

"నీరజా! మీట్ మిస్టర్ నందకుమార్. అవర్ కెమికల్ ఇంజినీర్" అంటూ నన్ను నీరజకు పరిచయం చేశాడు రాజారావు.

'నమస్కారం" అని రెండు చేతులూ జోడించింది నీరజ.

నేను రెండు చేతులూ జోడించకుండానే నిర్లక్ష్యంగా "నమస్తే!" అన్నాను.

"రేపటినుండీ యూ షల్ వర్క్ అండర్ హిమ్. ఓకే?" అన్నాడు రాజారావు. నా కేసి పరీక్షగా చూచి తన అంగీకారం తెలిపింది నీరజ.

"గుడ్ గర్ల్!" అన్నాడు రాజారావు.

ఆ తరవాత నీరజ నిష్క్రమించింది.

నీరజ వెళ్ళగానే, "సర్! నా కిదేం పనిష్మెంట్?" అని చొరవగా అడిగేశాను.

"పనిష్మెంటా? నో!నో! ఐ హావ్ గివెన్ యు ది బెస్ట్ స్టెనో ఇన్ అవర్ ఆఫీస్! నీరజ మన కంపెనీలో అయిదేళ్ళుగా పని చేస్తున్నది. ఎక్సలెంట్‌గా టైపు చేస్తుంది. ఇంపార్టెంటు మాటర్సు అన్నీ నీరజకే ఇస్తూ ఉంటాను. షి ఈజ రియల్లీ గుడ్! పాపం! జీవితంలో చాలా కష్టాలు పడిందని విన్నాను. ఐ పిటీ హెర్. అలా ముచ్చులా వేషం వేసుకుంటుందే కానీ, బాగా పరీక్షగా చూస్తే నీరజ ముక్కూ, ముఖమూ బాగానే ఉంటాయి" అంటూ చెప్పుకు పోయాడు రాజారావు.

రాజారావు నీరజను అయిదు సంవత్సరాలుగా చూస్తూ ఉండడం మూలంగా బాగా అలవాటు పడి అలా అన్నాడు. కానీ, ఎప్పుడూ నూనె కారిపోతూ జిడ్డు జిడ్డుగా ఉన్న నీరజ ముఖం మసి పూసుకున్నట్లు అసహ్యంగా ఉండేది. ఎదుటి వాడికి ఆమె ముఖం కేసి చూడాలనిపించేది కాదు. ఇదంతా కాకుండా నీరజ దగ్గరకు వస్తే ఒక విధమైన నూనెకంపుకూడా వేసేది. నీరజ పేరుకు నా పి. ఎ. గా పని చేస్తున్నా, ఆమెను మైలు దూరంలో ఉంచేవాణ్ణి.

అలాంటి నీరజతో నా బ్రతుకు ముడి పడుతుందని నేను కలలోకూడా వూహించని మాట.

అలా ఆరు నెలలు గడిచిపోయాయి.

ఒక ఆదివారం మినిస్టర్ రికమెండేషన్‌తో ఫారిన్ కాంట్రాక్టు ఒకటి రావడంతో నన్ను కన్సల్టేషన్‌కు తన ఇంటికి పిలిపించాడు రాజారావు. ఆ రోజే ఒప్పందాలుకూడా జరిగాయి. రహస్యంగా కాంట్రాక్టు టైపు చేయించి సంతకాలుకూడా ఆ రోజే కానిచ్చేయాలనుకున్నారు. కాంట్రాక్టు టైపు చేయించడానికి నీరజను తన ఇంటికి పిలిపించాలని రాజారావు అనుకున్నాడు.

నీరజ రాజారావు ఇంటికి దగ్గరలోనే చిన్న పోర్షన్ అద్దెకు తీసుకుని ఒంటరిగా జీవిస్తూందని ఆ రోజే నాకు తెలిసింది. రాజారావు నీరజ పట్ల శ్రద్ధ తీసుకుని తెలిసిన వాళ్ళ ఇంట్లో చిన్న భాగం ఒకటి అద్దెకు ఇప్పించగలిగాడట. నీరజ ఇంటి అడ్రెసు అతనికి తప్ప ఇంకెవరికీ తెలియదు. నీరజను వెంటనే పిలుచుకు రమ్మని నన్ను ఆమె వద్దకు పంపాడు.

ఎవరినైనా నౌకర్ని పంపక నన్ను వెళ్ళమంటాడేమా అని మొదట విసుక్కున్నా, వెళ్ళక తప్పింది కాదు.

మా భవిష్యత్తుకు పునాదిరాయి పడింది ఆ రోజే కాబోలు!

నాలుగు గంటలు దాటి ఉంటుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. రాజారావు చెప్పిన అడ్రెసు ప్రకారం నీరజ ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. పెద్ద కాంపౌండులో, బంగళా వెనక భాగంలో ఒక పక్కగా ఔట్‌హౌస్ కనుపించింది. తోటమాలిని అడిగి కాంపౌండులోకి ప్రవేశించాను. అతను నీరజ ఉంటున్న పోర్షన్ ముందు నిలబెట్టి వెళ్ళిపోయాడు.

రాజారావును మనసులో మరోకసారి తిట్టుకుని, మెల్లగా ఇంటి తలుపు తట్టాను. కాసేపటికి తలుపులు తెరుచుకున్నాయి.

విరబోసుకున్న వెంట్రుకలతో, ఉల్లి పొరలా ఉన్న తెల్ల చీరెలో, సుకుమారంగా, అందంగా నిలబడి ఉన్న నీరజను చూచి షాకైపోయి ఉంటాను. నాకు


వివాహ ప్రకటన

అన్ని కులముల అన్ని మతములకు చెందిన యువతీ యువకులకు వారి వారి అంతస్తుకు తగిన సంబంధములు మా వద్ద యున్నవి. డాక్టర్లు, ఇంజనీర్లు, లెక్చరర్లు మొదలగు అన్ని తరగతుల ఉద్యోగస్తులుకూడా వున్నారు. వివరములకు కళ్యాణమంటపము, బి—145, వసన్థశ్రీపురం, హైదరాబాద్—500 035 కు 35 పైసల కవరు జతపర్చి మీ వివరములతో వ్రాయండి. సంప్రదించు వేళలు: సా. 6 గం. నుండి 8 గం.

డా॥ పి. వి. కె. రావ్, B.A.



సెక్స్ స్పెషలిస్ట్

(వైద్య విద్వాన్-వైద్యాచార్య)

వివాహము వాయిందా వేయ నవసరము లేదు. దురభ్యాసములవలన కలిగిన నరముల బలహీనత, సుఖవ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు ... ...

రావూస్ క్లినిక్,

టి.బి.రోడ్, తెనాలి. ఫోన్: 700.

మూలశంకకు

త్వరగా

నమ్మకమైన

హెడనిసా

విరేచనముతో

చికిత్సను పొందండి

—శస్త్రచికిత్స

అవసరములేదు!

తెల జుట్టును

అంతమొందించండి

జుట్టు రంగుతో కాదు. మా సుహాసిని ఆయుర్వేద పుష్పమాల తలనూనె తెల్ల జుట్టును సహజమైన నలుపు రంగుకు శాశ్వతంగా మార్చుతుంది. ఇది కళ్ళకు, మెదడుకు వరప్రసాదం. వెల — 1 బుడ్డి రు. 12/— లు. 3 బుడ్లు రు. 30/— లు. పోస్టేజి అదనం.

**Gautam Chikitsalaya (O.T.)**

P.O. Katri Sarai (Gaya)

నోట మాట రాలేదు. ఈవిడ నీరజేనా అన్నట్టు గుచ్చిగుచ్చి చూశాను.

నీరజకూడా నన్ను చూసి తత్తరపడి పోయింది.

"మీ...మీ రిక్కడికి ఎ...ఎలా వచ్చారు?" అని కాస్సేపటికి తడబడుతూ అడిగింది. ఆమె స్వరం వినేటంత వరకూ ఏదో స్వప్నం తిలకిస్తున్నట్టు నిలబడిపోయాను.

"యు లుక్ రియల్లీ వెరీ ప్రెట్టీ!" మనసులోని మాట అప్రయత్నంగా అనేశాను. నా మాటలకు నీరజ చెక్కిళ్ళు కెంపులు తిరిగాయి.

"లోపలికి రావచ్చునా?" అని అడిగాను.

"ర...రండి." అయిష్టంగా పక్కకు తప్పుకుని నాకు దారి ఇచ్చింది నీరజ.

లోపలికి అడుగు పెట్టి, సభ్యత మరిచి నీరజను పరిశీలించడం మొదలు పెట్టాను. చక్కటి కళ్ళు కంగారుగా నా కేసి చూశాయి. ఆమె కనుపాపల్లో నా విగ్రహం స్పష్టంగా కనుపించింది. పెదవి క్రింద భాగంలో నల్లని పుట్టుమచ్చ. పెళ్ళి కూతురు బుగ్గను చుక్క పెట్టినట్టుంది. తలంటి పోసుకుంది కాబోలు, తల వెంట్రుకలు ఒత్తుగా భుజాల మీద పడి చిందర వందరగా ఆడుకుంటున్నాయి. ఉల్లి పొరలా ఉన్న చీరెలో నీరజ విగ్రహం తీర్చి దిద్దినట్లు ఒంపులతో ఒయ్యారంగా ఉంది. మామూలుగా స్త్రీల కేసి అంత ధైర్యంగా, అంత సూటిగా చూచే అలవాటు నాకు లేనే లేదు. కానీ, ఆ క్షణం నీరజను చూడకుండా ఉండడం అసాధ్యం అనిపించింది.

"ఏమిటి? అ...అలా చూస్తున్నారు?" నా చూపులు భరించలేక అన్నది నీరజ. ఉలిక్కి పడ్డాను.

"క్షమించాలి. మిమ్మల్ని ఇన్నాళ్ళూ మారువేషంలో చూశాను కదూ? ఇప్పుడు అసలు రూపంలో చూస్తూ ఉంటే మతి పోయి నట్లైంది" అన్నాను.

"మీ రసలు ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని అడిగింది.

అప్పటికి కానీ నాకు వచ్చిన పని జ్ఞాపకం రాలేదు.

"ఓ గాడ్! మరిచే పోయాను. మీరు వెంటనే రాజారావు ఇంటికి రావాలి. ఒక ఇంపార్టెంట్ కాంట్రాక్టు టైపు చేయవలసిన అవసరం వచ్చింది" అని చెప్పాను.

"డైరెక్టర్ ఇంటివద్దా?" అని అడిగింది.

"ఆఁ. నేను పొద్దుటి నుండీ అక్కడే ఉన్నాను" అని చెప్పాను.

"డైరెక్టర్ నన్ను పిలిపించారా?" ఆశ్చర్యంగా అన్నది.

"ఏం? ఆయనకు మీ మీద చాలా నమ్మకం ఉందని తెలియదా?" అని అడిగాను.


"నేను ఎవరి ఇంటికీ వెళ్ళనని ఆయనకు తెలుసే!" అన్నది నీరజ.

"ఇది చాలా ముఖ్య విషయం. మినిస్టర్ రికమెండు చేయడం మూలంగా మన కంపెనీ వెతుక్కుంటూ వచ్చారు. దీని మూలంగా కంపెనీకి లక్షలు లాభం రావచ్చు" అన్నాను.

తల అడ్డంగా ఆడిస్తూ, "నన్ను క్షమించాలి. నేను రాలేను!" అన్నది నీరజ.

"వ్వాట్?!" నమ్మలేనట్టు అరిచాను.

"నేను ఎవరి ఇంటికీ వెళ్ళను!" దృఢంగా




అన్నది నీరజ.

"మీరు రాకపోతే రాజారావుకు చాలా కోపం రాగలదు. మీరు ఆయన కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారని మరిచినట్లున్నారు. మీరు భవిష్యత్తు గురించి ఆలోచించి మాట్లాడుతున్నారనుకోను. ఇఫ్ యు డోంట్ కమ్, యు మే లూజ్ యువర్ జాబ్?" అన్నాను.

అప్పటికి కానీ నీరజకు పరిస్థితి అర్థం కాలేదు. కాస్సేపు మౌనంగా ఆలోచించి, "కూర్చోండి, బట్టలు మార్చుకుని వస్తాను" అన్నది.

"బాబోయ్! మారువేషం వేసుకుంటున్నారా?" అని భయంగా అడిగాను.

నీరజ పెదవులమీద నేను ఎప్పుడూ చిరునవ్వు చూడలేదు. ఆ క్షణం ఆమె పెదవులు అప్రయత్నంగా విచ్చుకున్నాయి.

పది నిమిషాల అనంతరం నీరజ బయటికి వచ్చింది.

మనిషి రూపంలో ఎంత మార్పు!

ముఖం మసి పూసుకున్నట్టు నల్లగా మారి పోయింది. పెదవి క్రింద పుట్టుమచ్చ పరీక్షగా చూస్తేనే కానీ కనుపించలేదు. అందమైన కళ్ళు కనుపించకుండా కళ్ళజోడు అడ్డు నిలిచింది. అట్టలా దువ్వుకున్న తల వెంట్రుకల్లోంచి గుప్పుమని నూనె కంపు నా ముక్కులో దూరింది.

'ఎవరికోసం ఈ మారువేషం?' అని అడగా లనిపించి నోరు తెరిచాను. కానీ, అడగలేకపోయాను.

"పదండి" అన్నది నీరజ.

నే నిద్దరమూ నడుచుకుంటూ రాజారావు ఇంటికి వెళ్ళాము. కాంట్రాక్టు పని పూర్తి అయే సరికి ఏడు గంటలు దాటింది. చీకటి పడిందని నీరజను మళ్ళీ ఆమె ఇంటి కాంపౌండ్ గేటువద్ద వదిలి నా దారిని నేను వెళ్ళిపోయాను.

ఆ రాత్రి మొదలు ప్రతి రోజూ నీరజ మారువేషం వేసుకోవడానికి కారణాలు ఏమిటా అని వెతుకుతూ కూర్చున్నాను. చప్పగా, ఒంటరిగా సాగిపోతున్న నా జీవితంలో నీరజ మారురూపం ఒక సమస్యగా, ఒక మిస్టరీ కథలా నన్ను వెంటా డిందని ఒప్పుకోవాలి.

ఆఫీసుకు నీరజ ఎంత మారువేషంలో వచ్చినా, నా కంటికిమాత్రం ఆమె అసలు రూపమే కనుపించడం మొదలుపెట్టింది. దీని మూలంగా నీరజను ఎప్పుడూ పరీక్షగా చూస్తూ ఉండడం అలవాటు అయింది. ఒక్కొక్కప్పుడు కళ్ళార్పకుండా నీరజను చూస్తూ నన్ను నేను మరిచి పోయేవాణ్ణి.

"సర్! లెటర్ సగంలోనే ఆపుచేశారు!" అంటూ నీరజ గుర్తుచేస్తూ నన్ను పిలిచేది. ఆమె పిలుపుకి తుళ్ళిపడేవాణ్ణి.

తన గురించి ఇతరులకు తెలియని రహస్యం నాకు ఒక్కడికే తెలుసు కాబట్టి తనను అసలు రూపంలో చూచిన వ్యక్తిగా నీరజ నాకు భయపడి, నేను ఏం చేసినా క్షమిస్తూ ఉండేదనుకుంటాను. దీనిమూలంగా మా మధ్య సాన్నిహిత్యం ఏర్పడ సాగింది. నా బలవంతంమీద ఆఫీసులో అడపా దడపా కలిసి కాఫీ పుచ్చుకునేవాళ్ళం. కొన్ని రోజులకు అది మధ్యాహ్నం 'లంచ్' దాకా వెళ్ళింది.


నీరజ అపారంగా చదువుకున్న వ్యక్తి అని గ్రహించడానికి నాకు అట్టే రోజులు పట్టలేదు. ఏ విషయం మాట్లాడినా ఆమెతో సంభాషణ తేలికగా నడిచిపోయేది. మొత్తానికి ఆమెతో మాట్లాడుతూ గంటలే గడిపేవాణ్ణి.

ఒక రోజు అనుకోకుండా ఆమే నాతో అన్నది:

"నే నీ ఊరు వచ్చి ఆరు సంవత్సరాలు దాటి పోయాయి. ఈ ఊళ్ళో నాకు తెలిసినవాళ్ళు చాలా మందే ఉండి ఉండాలి. కానీ, ఇంతవరకూ ఎవరూ నన్ను గుర్తుపట్టనే లేదు. మగవాళ్ళు ఇంతవరకూ నా వెంటబడి అల్లరి చేయలేదు. ఇదంతా ఈ మారువేషం మహాత్మ్యం అనుకుంటాను."

"మీ దే వూరు?" అని అడిగాను.

"ఒక్కొక్కప్పుడు అనుకుంటాను —నే నిప్పుడు మరో జన్మ ఎత్తానని. మీరు చాలా మంచి వారు,




ఐ లైక్ యు. ఇంకెప్పుడూ 'మీ దేవూరు?' అని అడగనని ప్రామిస్ చేయండి" అన్నది.

"ఐ ప్రామిస్ యు" అన్నాను.

మా మధ్య ఎన్ని రోజులు, ఎన్ని నెలలు గడిచాయో చెప్పలేను. మా స్నేహం మాత్రం కదం తొక్కుతూ చాలా దూరమే వెళ్ళింది.

"ఒక మాట అడగాలని ఉంది."

"ఏమిటి?"

"ఈ మారువేషం ఇంకెన్ని రోజులు వేసుకోవాలి?"

"నేను ... ఈ మారువేషం మాని అసలు రూపంలో వస్తే మీకు ఇష్టంగా ఉంటుందికదూ?" అని నీరజ సూటిగా నన్ను అడిగేసరికి ఆశ్చర్యపోయాను.

"నా ఇష్టం మాట కాదు. ఈ మారువేషం మానివేయడం మీకే మంచిదని నా ఉద్దేశం. ఐ లైక్ యు టు బి యువర్ సెల్ఫ్! మరో జన్మ ఎత్తా ననుకుంటున్న మనిషికి అసలు రూపంలో తిరిగే ధైర్యం కూడా ఉండాలని అనుకుంటాను" అన్నాను.

నీరజ నా ముఖంలోకి పరీక్షగా చూచి, "బహుశా మీ రన్నది నిజమే కావచ్చు" అన్నది.

మరో ఆరు నెలలు గడిచి ఉంటాయి.

నీరజలో చాలా మార్పులు వచ్చాయి. నడవడిలో, వేషధారణలో క్రమంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఎన్నో సంవత్సరాలుగా మూలపడి, ఎండకు ఎండి, వానకు తడిచిన గులాబీ చెట్టు మొగ్గ తొడిగి పూవు పూసినట్లైంది. నీరజ అందంగా, ఆకర్షణీయంగా తయారై ఆఫీసులో చలాకీగా తిరుగుతూంటే అందరూ తలొక విధంగా అనుకుంటూ విచిత్రంగా చూడసాగారు.

ఒక రోజు — "నందా! మొత్తానికి నీరజలో చాలా మార్పులు తీసుకు రాగలిగావు. నాకు చాలా సంతోషంగా ఉంది" అని రాజారావు అనేసరికి ఆశ్చర్యపోయాను.

"నే నేనా?"

రాజారావు నాకేసి అదోలా చూసి నవ్వాడు.

"ఆడది అందంగా ఉండాలని ఎప్పుడు ప్రయత్నిస్తుందో తెలుసా?" అన్నాడు.

"ఎప్పుడు?" అంటూ తెలివి తక్కువగా ప్రశ్నించాను.

"వెన్ షి ఈజ్ ఇన్ లవ్" అంటూ నవ్వి పారేశాడు రాజారావు.

అంతవరకూ ఆఫీసు గదిలో తప్ప నేనూ, నీరజా బయట ఎప్పుడూ కలుసుకోవడంకానీ, మాట్లాడుకోవడం కానీ జరగలేదు. నీరజలో వచ్చిన మార్పులు ప్రత్యేకించి నాకోసమని రాజారావు ఎందుకు అనుకున్నాడో అర్థం కాలేదు. మా నడవడిలో మరొక ఉద్దేశం ఉందని అనుకునేందుకు మేము తావు ఇవ్వలేదు.

ఆ రోజు బయట కుండపోతగా వర్షం పడుతూంటే తలుపులన్నీ వేసుకుని గదిలో వెచ్చగా కూర్చుని ఉన్నాను. నా ఆలోచనలన్నీ నీరజ మీదే కేంద్రీకృతమై ఉన్నాయి.

మొదటిసారిగా మా సంబంధం గురించి విముర్శించడం మొదలుపెట్టాను.

నీరజ రెండు రోజులుగా ఆఫీసులో చాలా పని మీద ఉంది. రాజారావు ఆమెకు 'స్పెషల్ వర్క్' ఏదో ఇచ్చినట్టున్నాడు. గడిచిన రెండు రోజులు భాస్కర్ అని మరో స్టెనోకు నా ఉత్తరాలు డిక్టేటు చేయవలసి వచ్చింది.

ప్రతిరోజూ నా చుట్టూ తిరిగే మనిషి నా ఎదుట కనుపించక పోయేసరికి నాలో ఒంటరితనం వ్యాపించి నట్లైంది. నీరజను చూడాలనే వాంఛ బలమైన కోరికగా నాలో ఉరకలు వేసేసరికి ఆశ్చర్యపోయాను. నీరజతో ఒకసారి మాట్లాడాలని ఫోను అందుకోబోయాను.

ఇంతలో నీరజే హడావిడిగా నా గదిలోకి ప్రవేశించింది.

"థాంక్ గాడ్! యూ హావ్ కమ్ బాక్ టు మి! ఆ భాస్కర్‌కు లెటర్సు టైపు చేయడం అసలు రాదు!" అంటూ నీరజను నవ్వుతూ గ్రీట్ చేశాను.

"నాన్‌సెన్స్! మీకు లెటర్సు డిక్టేట్ చేయడం రాదని చెప్పండి. ఈ ఉత్తరాలు చూచారా? ఆఫీసులో అందరూ నవ్వుకున్నారు!" అంటూ లెటర్సు నా ముందు పెట్టిందీ. నేను క్రిందటి రెండు రోజులూ ఏ పరిస్థితిలో ఉన్నానో అప్పటికి కానీ నాకు అర్థం కాలేదు.

ప్రతి ఉత్తరంలో 'మై డియర్ సర్' బదులు 'మై డియర్ నీరజ' అని డిక్టేట్ చేశాను.

"నిన్న అంతా భాస్కర్‌ను 'నీరజా!' అని పిలిచారట! నిజమేనా?" అని అడిగింది.

నీరజ కళ్ళలోకి దీర్ఘంగా చూశాను.

"అందరూ ఏమనుకుంటారు?" నొచ్చుకుంటూ అన్నది నీరజ.

"అందరూ ఏమనుకుంటున్నారు?" అని అమాయకంగా అడిగాను.

నా ప్రశ్నకు నీరజ బుగ్గలు ఎర్రగా కంది పోయాయి.

"పోనీ, నీరజ ఏమనుకుంటున్నదో వినాలని ఉంది" అంటూ ఆమె కళ్ళలోకి ఆపేక్షగా చూచాను.

నీరజ కళ్ళు క్రిందికి దించేసుకుంది.

నా అంతరంగంలో అన్ని రోజులుగా దాగుని ఉన్న కోర్కెలకు అనకట్ట తలుపులు ఏవో తెరుచుకున్నట్లైంది.

"డామిట్! ఐ లవ్ యు!" అంటూ అమాంతం కుర్చీలోంచి లేచి నీరజను దగ్గరకు తీసుకోబోయాను.

"ప ... నందా! నీ... నీకు మతిపోయిందా?" అంటూ నాకు దూరంగా జరిగింది.

"అవును. నాకు మతిపోయింది. దానికి కారణం నువ్వే! నేను నిన్ను ప్రేమిస్తున్నాను, నీరజా! ఐ వాంట్ టు మేరీ యు!" నీరజ భుజాలు పట్టుకుని అన్నాను.

"ప్లీజ్! ... నందా! మన స్నేహం ఇలా సాగనివ్వు!" అంటూ ఏదో చెప్పబోయింది.

"స్త్రీ పురుషుల మధ్య స్నేహం ఇలాంటి మలుపు తిరగకుండా ఉండడం అసాధ్యం, నీరజా! ఇన్నాళ్ళూ నీ సమక్షంలో గంటలు గడిచిపోతూ ఉంటే, నువ్వు నాకు అవసరం కావలసినదానివని గ్రహించలేక పోయాను. ఈ రెండు రోజులూ నువ్వు నా కంటికి కనుపించక పోయేసరికి —" నా మాటలు వినిపించుకోలేదు నీరజ.

"భగవంతుడా! నీకు ఏమని చెప్పను?" అంటూ తన అరచేతుల్లో ముఖం దాచుకుంది నీరజ.

"నీ...ర...జా!" అంటూ ఆమె ముఖం బలవంతంగా పైకి ఎత్తాను.

"నా... నా గురించి నీకేం తెలియదు." పైకి పొంగుతున్న దుఃఖం దిగమింగుకుని దృఢంగా అన్నాది నీరజ.

"నీ గురించి నా కింకేం తెలియాలి? కులం, గోత్రం, గతం, మతం— వీటితో నాకు పనిలేదు, నీరజా! నాకు కావలసింది నువ్వు! ఒకే ఒక్క మాట చెప్పు. నన్ను వివాహం చేసుకుంటావా? అవునంటావా? కాదంటావా?" అని అడిగాను.

"నా గురించి అంతా నీతో చెప్పుకోవాలి— తప్పదు." బాధగా అన్నది.

"అదంతా నా కనవసరం!" ఆవేశంగా అరిచాను.

"ఈ క్షణం ఆవేశంలో ఉన్నావు. కానీ, రేపు ఏమంటావో?" అన్నది నీరజ.

"నువ్వు నాకు కావాలి! నేను నీకు కావాలా వద్దా?" ఒళ్ళు మరిచి గట్టిగా అడిగాను.



శ్రీ ఆర్. వీరరాఘవన్

28—8—80 న దివంగతులయారు

## మ ర ణ ము

శ్రీ ఆర్. వీరరాఘవన్, పార్ట్నర్స్, కె. ఆర్. బ్రదర్స్, ఇన్సూరెన్స్ ఏజెన్సీస్ మరియు బాను అండ్ కం., 7, స్వామి ముత్తయ్య మొదలి వీధి, మద్రాసు - 600 001. 28-8-80 న ఆకస్మాత్తుగ దివంగతులు అయారని ప్రకటించుటకు మేము మిక్కిలి చింతిస్తున్నాము.

దుఃఖపూరితులైన కుటుంబ సభ్యులు, మిత్రులచే ప్రకటించబడినది.

## తెల్ల మచ్చల వైద్యం

### వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల మంది విముక్తి పొందిన వేలకొలది రోగుల నుండి ప్రశంసలు అందినవి. ఇటువంటి ప్రశంసలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారి పోవడం మొదలవుతుంది. మరియు శీఘ్రంగా చర్మం యొక్క రంగు వచ్చి ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అది ఎంత బాగా పనిచేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చేదు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందును ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెందితే ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి.

ఈ వైద్యం కోసం మందును ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)

## బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!

### స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్ను వాడిన స్త్రీలు ఎందరో!

ఉచిత వైద్య సలహాకు ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు ఈ కూపన్ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు__________

విలాసము__________

__________PIN__________




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14.

ఏజెంట్లు: సీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్ —


"నా గత చరిత్ర ఏమీ తెలుసుకోవాలని లేదా?" అని మళ్ళీ అడిగింది.

"నో!" అంటూ గర్జించాను.

"నా గత చరిత్ర వినటానికి భయపడుతున్నావా?" అని అడిగింది నీరజ.

"ఓహో! నీరజా! జీవితంలో కావాలనుకున్నది దొరకడం ఎంత కష్టమో తెలుసా? తీరా చేతికి దొరికినాక దానిని మనసారా అందుకోవాలి. గత చరిత్ర వింటూ కూర్చోవడం దేనికి?" నా ఆవేశానికి కళ్ళెం కట్టి శాంతంగా అన్నాను.

"నువ్వు నిజంగా అలా అనుకుంటున్నావా?" నా కళ్ళలోకి చూస్తూ అడిగింది నీరజ.

"నా మాట మీద నీకు నమ్మకం లేదా?" అని దీనంగా అడిగాను.

"నా గత చరిత్ర ఎంత నీచమైనదైనా —"

నా అరచేతితో నీరజ పెదవులు మూసి, "పిచ్చీ! నువ్వు నా కోసం మళ్ళీ జన్మ ఎత్తావు కదూ?" అని గుర్తు చేశాను.

"నిందా!"

"అవును, నీరజా!"

"నిజమే, నిందా! నేను ఎప్పుడో నీతో జన్మ ఎత్తాను" అంటూ నన్ను తన చేతులతో చుట్టేసింది.

నెల రోజుల తరవాత రిజిస్ట్రార్ ఆఫీసులో మా వివాహం జరిగిపోయింది. మా వాళ్ళకు నేను నీరజను వివాహం చేసుకోవడం ఇష్టం లేకపోయింది. మా పెళ్ళికి ఎవరూ రాలేదు.

ఆ రాత్రి రాజారావు మాకోసం 'స్పెషల్ డిన్నర్' ఇచ్చాడు. మా మొదటి మూడు రాత్రులూ ఫైవ్ స్టార్ హోటల్ రూములో గడిచిపోవాలని రాజారావు కంపెనీ అకౌంటులో ఒక గది బుక్ చేయించాడు.

డిన్నర్ అయ్యాక 12 గంటల రాత్రి నీరజను హోటల్ రూముకు తీసుకు వచ్చాను. ఇదంతా నీరజకు ఎందుకో ఇష్టం లేకుండా పోయింది.

"రిసెప్షన్ కౌంటర్లో మనల్ని చూసి ఏమను కుని ఉంటా రంటావ్?" అని హఠాత్తుగా ప్రశ్నించింది నీరజ.

"వాళ్ళా్ఏము మిాన్?" అని ఆశ్చర్యపోయాను

* * *

గతం ఏమిటో తెలియదు.

అదంతా ఎప్పుడో మరిచి నీరజ నాకోసం మళ్ళీ జన్మ ఎత్తిందనుకుంటూ వెర్రిగా బ్రతికాను. ఇప్పుడు ఎదురు చూడని గతం సావిత్రి రూపంలో వచ్చి నా గుండె మీద కుంపటిలా కూర్చుంది. నాది అనుకుంటున్నది మరొకడి సొత్తు అయిపోతుందనే భయంతో నా అసలు రూపం బయట పడిపోయింది.

హృదయంలో భరించలేని ఆవేదన.

ఎవరికి ఏమని చెప్పుకోను? నీరజ గురించి ఏమీ తెలుసుకోకుండా ఈ వివాహం ఎలా చేసుకున్నావని అడిగేవారికి ఏమని చెప్పను? అర్థం చేసుకునేవా రెందరు? ఎన్ని రోజులు గడిచాయో చెప్పలేను— నాకు కాలచక్రమే నిలిచినట్లు అనిపించింది. సావిత్రి మళ్ళీ నా కంటికి కనుపించలేదు. కానీ, వాడి క్రూరాగి రూపం, దొంగచాటువాడిలా నన్ను రాత్రీ, పగలూ వెంటాడింది. వాడికోసం రోజూ బజారులో వెతుకుతూనే ఉన్నాను. వాడు మళ్ళీ కనిపిస్తే కొట్టి అవతలిలో

ప్రతి రోజూ అడుగుతూనే వచ్చాను. అంగడివాడు "ఆయన మీకు ఏం కావాలి, బాబూ?" అని అడుగుతూంటే ఏడ్వలేక నవ్వాను. అవును, సావిత్రి ఇప్పుడు నాకేం అవుతాడు?"

ఆడదానికి 'సవతి' అంటూ ఉంటుంది. కానీ, మగవాడికి?

నీరజ సావిత్రిని ఇంకా ప్రేమిస్తున్నదా?

వైనాట్? ఎస్! వైనాట్?

ఒకసారి ప్రేమించిన వ్యక్తిని ఇంకా ఎందుకు ప్రేమించకూడదు?

ఒకప్పుడు నీరజ తన సర్వాల సావిత్రికి అందించింది. తన సర్వం...మరి ఇప్పుడూ?

ఆడది ఒకేసారి — ఒక్కరినే ప్రేమిస్తుందని అంటారు.

డామిట్! అందులో ఏమాత్రం నిజం లేదని నాకు తెలుసు. ఎంత మంది స్త్రీలు పునర్వివాహం చేసుకుని హాయిగా కాపరం చేయడం లేదు! ఎంత మంది అమ్మాయిలు కాలేజీలో ప్రేమించిన అబ్బాయిని కాదని తలిదండ్రులు కుదిర్చిన సంబంధం చేసుకుని సుఖపడిపోవడం లేదు?

అదంతా ప్రేమకాక నటన అవుతుందా? నాన్‌సెన్స్!

ఫస్ట్ లవ్ ఈజ్ స్వీట్ అంటారు. సెకండ్ లవ్ ఈజ్ స్వీటర్ అనకూడదని ఎవరన్నారు? ఇదంతా కవుల కల్పన.

ప్రేమికుల భ్రమ!

అంతకుమించి ఇందులో నిజం లేదని నాకు బాగా తెలుసు.

అయినా— ఏమిటి సందేహం? సందేహం కాదు. సంకోచం.

కాదు, కాదు. వ్యథ.

ఇంతకూ నీరజ సావిత్రిని గుర్తుపట్టి ఉండేదో, లేదో?

పన్నెండు సంవత్సరాల క్రితం జరిగిన వివాహం, వాళ్ళ విషాద ప్రేమ కావ్యం మరిచిపోవడంసాధ్యమా? అందులో సావిత్రి గడిచిన పన్నెండు సంవత్సరాలుగా తనకోసం అన్వేషిస్తున్నాడంటే మనసు నిలుపుకోగలదా? నాకే ఉసూరు మనిపించిందే! నేనే వాడికి ద్రోహం చేసినట్లు వంచకుడులా తల వంచుకుని తిరుగుతున్నానే! పాపం, నీరజ ఏం చేస్తుంది?

నాకు చెప్పకుండా, నా మనస్సు నొప్పించకుండా వాడి వెంటకు చేరి ఓదారుస్తుందా?

సానుభూతితో సర్వమే ఇచ్చుకుంటుందా?

ఈ [illegible] నీరజ భరించగలదా?

నన్ను వదలలేక, సావిత్రిని కాదనలేక ఆత్మహత్య చేసుకుంటే?

నా గుండె గుబేలుమంది.

సావిత్రి ఏ క్షణం వస్తాడో, వాడు వస్తే నీరజ ఏం చేస్తుందో అనే భయంతో ఆఫీసునుంచి ఇల్లు చేరుకోగానే నీరజ [illegible] పెట్టడం మొదలు పెట్టాను.

"ఎందుకీ గారం?" నీరజ నన్ను విచిత్రంగా చూస్తూ అడిగేది.

"[illegible] వాడు లోపలికి రాకుండా ఉండేందుకు" అని చెప్పి వాడిలా జవాబు ఇవ్వలేను.

FREE ! **ముత్యాల సరాలు** ఉచితం!!

## దాచిన పాపం

నాగార్జున సాగర్, తుంగభద్ర, శ్రీశైలం లాంటి గొప్ప ప్రాజెక్టులు నిర్మించినప్పుడు అడ్డుగా వచ్చే పెద్ద బండరాళ్ళను బద్దలు కొట్టటానికి డైనమైట్‌లను వాడుతూ వుంటారు. ఇవి చాలా ప్రమాదకరమైనవి కాబట్టి వాటిని ఇంటిలో దాచుకోవటం గొప్ప నేరం. అయినా ఈ డైనమైటును ఒక కూలివాడు ఇంటికి తెచ్చి బియ్యం బస్తాలో దాచి పెట్టాడు. ఏటి ఒడ్డున వాటిని పేల్చినప్పుడు వాటి శబ్దమునకు ఏటిలోని చేపలు మరణించి పైకి తేలుతూ వుంటాయి. అప్పుడు వాటిని పట్టుకొని భుజించటం ఆ కూలీల కలవాటు. మసక చీకటిలో బియ్యం బస్తాలో దాచిన డైనమైట్‌ను బియ్యంతో సహా తీసి వృద్ధురాలైన అతని తల్లి కుత కుత పొంగే నీళ్ళలో పోసి గరిటతో కలియబెట్టుచుండగా అది పేలి వేడివేడి గంజి ఆమె కళ్ళలో పడి ఆమెను అంధురాల్ని చేయడమే గాకుండా ముఖమంతా కాలి లోతైన గాయాలు కలిగించింది.

ఎంత రహస్యంగా పాపాలు చేసినా ఏదో ఒకనాడు ఆ పాపాలు ఏదో విధంగా వెల్లడి చేయబడక తప్పదు. పాపం కూడా ఈ ప్రేలుడు మందు వంటిదే. పాపంతో చెలగాటా లాడుతూ చేస్తున్న పాప కార్యాలను బట్టి ప్రగల్భాలు పలికే వారు మనలో లేకపోలేదు. పాపాన్ని తాకి, రుచి చూచి, ఎన్నెన్నో దురలవాట్లు అలవర్చుకొని వాటిలో ఆనందిస్తూ "ఏముంది! అనుకొన్నప్పుడు వీటిని ఆపివేయగల"నని కొంతమంది అనుకుంటుంటారు గాని వారిలోని సుస్వభావము, సభ్యత, మానాభిమానాలు ఏనాడో వారిని విడిచి వెళ్ళి పోయాయని వారు ఆలస్యంగా గుర్తిస్తారు.

దేవుని గురించి ఆలోచించటానికి ఇంకా చాలా సమయం వుందని కాలం వాయిదా వేస్తూ వుండగానే ఎవ్వరూ వూహించని వేళల్లో అంతవరకూ వారు ప్రేమించిన పాపం భగ్గున మండి, పటాలున ప్రేలి అనుకోని అగాధంలో వారిని త్రోసివేస్తుంది. తీవ్రమైన వ్యాధులు, ఎదురు చూడని ప్రమాదాలు వీటి వలన ఎంతమంది ఎటువంటి సిద్ధపాటు లేకుండానే నిత్యత్వంలోనికి విసిరి వేయబడుతున్నారు. విమానం కూలి మరణించినవారు, రైలు పట్టాలు తొలగి మరణించిన వారు, లారీలు గుద్దుకొని మరణించిన వారి గూర్చి ప్రతి రోజూ వార్తాపత్రికలలో చదువుతూ కూడా ఈ మరణం కొఱకు సిద్ధపడక పోవటం వెర్రితనం కాదా!

"మనుష్యులు ఒక్కసారే మరణిస్తారు. అటు పిమ్మట న్యాయ తీర్పు జరుగునని" పరిశుద్ధ గ్రంథమైన బైబిలులో వ్రాయబడి యున్నది. మరణం ఎవ్వరినీ గౌరవించదనీ, ఎవరికీ కబురంపి రాదనీ, వయస్సుతో దానికి పని లేదనీ అందరికీ తెలిసిన సత్యమైనా మరణం గురించి ఎంత నిర్లక్ష్యం! చేసిన పాపముల కోసం పశ్చాత్తాపం క్రీస్తు యేసు నందు విశ్వసించటం ద్వారా పాపక్షమాపణ పొంది నిత్యజీవమునకు మేము వారసులము కాగలము అను నిశ్చయత మీకుందా? చేసిన పాపం దాచి పెట్టవద్దు. దాని కొరకు సాకులు చెప్ప వద్దు, [illegible] సరిదిద్దటానికి ప్రయత్నింప వద్దు. ఈ నాడే వాటిని దేవుని యెదుట ఒప్పుకొని వాటి నుండి తొలగి పొమ్ము.

నీ హృదయం మార్పు చెందితేనే తప్ప నీవు పరలోక రాజ్యములో [illegible] యేసు క్రీస్తు గురించి తెలుసుకున్నారా!

— చదలవాడ [illegible]

ఉచితం !! ఉచితం !!!

దైవస్వరూపుడు, కరుణామయుడగు యేసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన కమనీయ బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా పొందదలచుకుంటే మీ చిరునామా మాకు వెంటనే తెల్పండి. పోస్టు ఖర్చులు మేమే భరించి ఉచితంగా మీకు పుస్తకం పంపుతాము. ఈ రోజే వ్రాయండి.

ఫార్ కార్నర్స్,
పోస్టు బాక్సు నెం. [illegible],
ఖైరతాబాద్,
హైదరాబాద్-4.
FAR CORNERS.

GOSPEL MESSAGE INSERTED BY FAR CORNERS.




ఒకొక్కప్పుడు నా మనస్సాక్షి నా చేతకాని తనానికి నవ్వుకునేది.

'పిచ్చివాడా! నీరజను భార్యగా స్వీకరించడానికి సౌమిత్రి నీ లాంటి చేతకాని వాడు అనుకున్నావా? సౌమిత్రి ఈ భారతదేశంలో పుట్టిన మగవాడోయ్! నీరజ నీతో నాలుగు సంవత్సరాలు కాపరం చేసింది. చట్టబద్ధం అయినా, కాకపోయినా తన సర్వం నీకు అంకితం చేసుకుంది. ఇదికాకుండా పోలీసుల బారి నుండి తప్పించుకుని పారిపోయిన నీరజ నీచమైన బ్రతుకు ఏదో బ్రతికింది. శీలం పోగొట్టుకున్న స్త్రీని సౌమిత్రి భార్యగా ఎందుకు స్వీకరిస్తాడు? అందుకే ఆ రోజు చెప్పకుండా అలా పారిపోయాడు. ఆమాత్రం అర్థం చేసుకోలేక ఎందు కీ ఆవస్థ?' అంటూ హేళన చేసేది.

నేను నిజంగా చేతకానివాడినా?

నన్ను నీరజ మోసం చేసింది. తనకు వివాహమైన దని నాతో చెప్పలేదు. తన భర్త బ్రతికే ఉండవచ్చు నని నాతో ఒక మాట అని ఉంటే?

అర్థం లేని ఆలోచనలు నన్ను పాతాళలోకానికి నెట్టాయి.

పిడికిళ్ళు బిగించి పళ్ళు పటపట కొరుక్కున్నాను.

గోళ్ళు గిల్లుకున్నాను.

నా తల వెంట్రుకలు గట్టిగా పీక్కున్నాను.

నీరజ అంతరంగంలో దూరి ఆమె రహస్యాలు తెలుసుకోవాలనే ఆశతో తల్లడిల్లి పోయాను. జరిగినదంతా ఆమె నోటితో చెప్పించుకుని నా తాపం ఏదో తగ్గించుకోవాలనే స్వార్థంతో నాలో ఎన్నడూ లేని కోరికలు పైకి లేచి తైతక్కలాడాయి.

"నీరూ! చెప్పు! నీ గత చరిత్ర అంతా నాతో చెప్పు!" అంటూ నీరజను అడిగేయాలని నోటిదాకా వచ్చేది.

కానీ—ఏ ముఖం పెట్టుకుని అడగను? ఎందుకని అడగను? ఎలా అని అడగను?

'పిచ్చి! నువ్వు నా కోసం మరో జన్మ ఎత్తావు కదూ?' అన్న నోటితోనా?

నా మీద నాకే అసహ్యం వేసింది.

కోపంతో పుస్తకాలు చించాను.

గ్లాసులు, కప్పులు విసిరి విసిరి కొట్టాను.

చెల్లాచెదరైన గాజు పెంకులు ఏరుతూ నన్ను నేను కసితీరా గుచ్చుకున్నాను. ఎర్రటి రక్తం నేల కారిపోతూంటే, నీరజ అదురుకుంటూ వచ్చి చేయి పట్టుకుని కట్టుకట్టేది.

"ఏమిటి, నందా? ఇప్పటికి ఎన్నిసార్లు గుచ్చుకున్నావో తెలుసా? నువ్వు ఇంకమీదట పగిలిన గాజు పెంకులు ఏరకు!" అని నీరజ మందలించేది.

పగిలిన గాజు పెంకులు!

ఏరుకోకపోతే ఎలా? అది నా రూపం?

నా అసలు రూపం ఇదా?! ఇన్నాళ్ళు నకిలీ రూపంలో నీరజను మోసం చేశానే? నే నెంత పిరికి పందనో అర్థం అయింది. నాలో ఇంత బలహీనత ఉందా? ఆశ్చర్యం వేసింది.

నేను నమ్మిన ఆదర్శాలు రోజు రోజుకు అడుగంటి పోతూంటే, నా కొత్త రూపం చూసి నీరజ వణికిపోయి మూగగా ఉండిపోయింది.

ఒక ఆడది తన గత చరిత్ర చెప్పుకోవడానికి సందేహిస్తే, అవమానంతో కుంచించుకుపోతే అందులో అర్థం ఆవిడ శీలవతి కాదనే.

ఆమెను ఎవరో దుండగులు బలాత్కారమైనా చేసి ఉండాలి. లేకపోతే ఎవరి బలవంతంమీదో, ఉదర నిమిత్తమో వ్యభిచారమైనా చేసి ఉండాలి. ఈ రెండూ కాకపోతే ప్రేమించి మోసపోయి పెళ్ళి కాకుండా మాతృత్వం పొంది ఉండాలి. లేదా భర్త హింసలు భరించలేక ఇంట్లోంచి లేచిపోయి ఉండాలి. ఈ విషయాలు బయటికి చెప్పుకోలేక, మరిచిపోలేక మహా పాపం చేసినట్లు, వంచకురాలిలా జీవిస్తుంది స్త్రీ. ఆమెకు 'పతిత' అని చీటీకట్టి అంటరాని వస్తువులా, ఎంగిలి విస్తరాకులా విసిరి పారేయడం అన్యాయం. మైలవ నట్లు దూరంగా ఉంచడం శోచనీయం.

ఆమెకు ఆశ్రయం ఇచ్చి పేపు తట్టుకోవడం అంతకంటే ఘోరం. 'నా గురించి నీకు ఏమీ తెలియదు' అని నీరజ ఆనాడు అన్నప్పుడు ఆమె గత చరిత్ర ఇలాంటి బాపతుకు చెంది ఉంటుందని నేను ఎప్పుడో అనుకున్నానని నీరజకు ఎలా చెప్ప గలను?

నీరజ నోటితో జరిగినదంతా చెప్పించుకుని, ఆమెను భార్యగా స్వీకరించి నే నేదో గొప్ప కార్యం చేసినట్లు 'ఔదార్యవంతుడు', 'త్యాగమూర్తి' అని బిరుదులు పొందడం నాకు పరమ అసహ్యం.

నేను నీరజను మనసారా ప్రేమించాను. ఆమె స్వభావం నాకు చాలా నచ్చింది. మనిషి గుణం గత చరిత్ర విన్నంత మాత్రాన మారుతుందా? స్త్రీ శీలం కేవలం సెక్సుకు సంబంధించిన విషయమనుకోవడం ఎంత తెలివి తక్కువ? సంస్కారవంతులెవరూ అలా అనుకోవడానికి వీలు లేదు.

ఒకరి గత చరిత్ర వ్యక్తిగత విషయం. అది సెక్సుకు సంబంధించినదైతే మరొకరికి చెప్పుకోవలసిన అవసరం లేదు. అవమానంతో తల వంచుకుని తిరగవలసిన పని లేదు.

వర్తమానం నిష్కపటంగా జీవించగలిగితే అంతే చాలు.

"నా గత చరిత్ర నీకు తెలుసుకోవాలని లేదా?" అని నీరజ నాతో ఆ నాడు అన్నప్పుడు "నో!" అని అరిచింది ఇందుకోసమే.

కానీ ఇప్పుడు ఆమె నోటితో ఆమె గత చరిత్ర అంతా వినాలనే తహతహ నా ప్రాణం తీస్తున్నదని సిగ్గు విడిచి నీరజకు ఎలా చెప్పను?

ఛీ! ఛీ!

భగవంతుడా! ఏమి టీ పరీక్ష?

నేను ఎందు కిలా దిగజారిపోతున్నాను?

కారణం ఏమైతేనేం? ఆశయం నిలబెట్టుకోలేకపోతే జీవించి ప్రయోజనం ఏమిటి?

ఇదా నా అసలు రూపం?

ఇదా నా గురించి నేను తెలుసుకున్న సత్యం?

విపరీతంగా సిగరెట్లు తాగాను.

నిద్ర మాత్రలు వేసుకున్నాను.

చివరికి తాగుడుకూడా మొదలు పెట్టాను.

చాలా ప్రమాదకరమైన జబ్బుతో మంచాన పడి గిలగిల లాడుతున్న రోగిలా నాకుకూడా ఆఖరి దశ సమీపించి నట్లైంది.

ఎన్ని రోజులు?

ఈ రంపపు కోత ఇంకెన్ని రోజులు?

నాకు శాశ్వతంగా నిద్ర పోవా లనిపించింది.

ఆఫీసుకు సెలవు పెట్టి, అది ఎన్నో రోజో చెప్పలేను. లేచినది మొదలు తాగుతూనే ఉన్నాను.

నా చుట్టూ సిగరెట్టు పీకలూ, విస్కీ బాటిల్సూ దొర్లుతున్నాయి. నీరజ ఇక సహించలేక పోయింది.

"నందా! ఏమి టిది? స్వప్నంలా సాగిపోతున్న మన సంసారాన్ని ఎందు కిలా నాశనం చేస్తున్నావ్? ఇది నీ వ్యక్తిగత విషయమే కావచ్చు. కానీ, నీ భార్యగా ఇందులో భాగం పంచుకునేందుకు నాకు హక్కు ఉంది. చెప్పు, నందా! ఏమైంది? నిన్ను ఎవరు హింస పెడుతున్నారో చెప్పు! ఈ సమస్యకు పరిష్కారం వెతకవలసిన బాధ్యత నాకుకూడా ఉంది." నీరజ ఏమంటున్నదో నాకు సరిగా వినపడలేదు.

నీరజను అమాంతం కౌగిలించుకుని బావురుమని కుండ పగిలినట్లుగా రోదించాను.

"న...నందా!"

"నీరూ! నువ్వు నన్ను విడిచి వెళ్ళిపోతావా?"

"నందా?"

"నువ్వు లేకుండా బతకలేను."

"న... నందా!"

"నువ్వు వెళ్ళిపోతావని భయంగా ఉంది!"

"నో! నందా!"

ఆ రాత్రంతా పసిపిల్ల వాడిలా ఆమె ఒడిలో నిద్ర పోయాను.

చాలా రోజుల తరవాత నీరజ ఒడిలో నాకు బాగా నిద్ర పట్టింది.

'అప్పుడే తెల్లవారిందా' అనుకుంటూ ఉలిక్కి పడి కళ్ళు తెరిచి చూశాను. బయట అంతా వెలుగు!

చేతి గడియారం కేసి చూసుకున్నాను. పద కొండు గంటలు దాటింది.

కంపరం పుట్టించే ఇంగ్లీషు సినిమా చూస్తున్న వాడికి కాస్సేపు విశ్రాంతి సమయం చిక్కినట్లు గత రాత్రి గడిచి పోయింది. కానీ, కళ్ళు తెరవగానే సౌమిత్రి 'డ్రాకులా' మాదిరి ఎదుట నిలిచి కోరపళ్ళు చూపించాడు.

హృదయంలో భరించలేని ఆవేదన, మలేరియా జ్వరంలా విపరీతమైన చలి పుట్టిస్తూ శరీరాన్ని గడగడ వణికిస్తూ తీవ్ర రూపం దాల్చింది.

సౌమిత్రి తప్పకుండా తిరిగి వస్తాడు. నీరజను తన వెంట తీసుకుని వెళ్ళి పోతాడు. పట్నం, సంఘం సానుభూతితో వాళ్ళను ఒకటి చేస్తాయి.

నీరజ వెచ్చని శరీర స్పర్శ, నీరజ గాఢమైన కౌగిలి, నీరజ పెదవుల మృదుత్వం గత రాత్రి అనుభవించిన మధురమైన క్షణాలు ఒకటి, ఒకటి గుర్తుకు వచ్చి నన్నింకా చిత్రవధ చేశాయి.

చటుక్కున రాకూడని ఆలోచన వచ్చింది.

సౌమిత్రిని చంపి ఎక్కడైనా పాతిపెడితే? అబ్బా? కొన్ని క్షణాల తరవాత ఒక చేతిలో కాఫీ కప్పూ, మరొక చేతిలో రెండు ఉత్తరాలూ పట్టుకుని చిరునవ్వుతో గదిలో ప్రవేశించింది నీరజ.

"గుడ్ మార్నింగ్, సర్! బాగా నిద్ర పట్టినట్లుంది!" అంటూ దగ్గరికి వచ్చింది. నా కళ్ళు ఉత్తరాల మీద పడ్డాయి. మా ఇంటికి సాధారణంగా ఉత్తరాలు రావు. అవి నేరుగా ఆఫీసుకే వస్తాయి.

"ఆ...అవి ఇవాళ వచ్చిన ఉత్తరాలా?" ఆత్రతగా అడిగాను.

"వూఁ! ఇదే మో మన ఇంటి ఓనర్ వ్రాసింది. ఇంటి అద్దె పెంచుతాడట. ఇది ఎవరు వ్రాశారో ఏమో నే నింకా చింపి చదవ."

నీరజ మాటలు పూర్తి కాలేదు. ఆమె మీద పులిలా పడి ఉత్తరం లాక్కున్నాను.

కాఫీ అంతా నేల ఒలికిపోయింది.

"న నందా!" నీరజ నా కేసి కోపంగా చూసింది.

"సారీ!" తప్పు చేసిన వాడిలా తల దించేసుకున్నాను

"పోనీలే. నే నింకా స్నానం చేయలేదు" అంటూ నా తల ప్రేమగా నిమిరి, "నువ్వు తీరికగా ఉత్తరం చదువుకో. మరో కప్పు కాఫీ చేసి పట్టుకు వస్తాను" అని నీరజ వెళ్ళిపోయింది.

ఉత్తరం గబగబా చింపి చదివాను.

నా ఫ్రెండ్ డాక్టర్ రాజశేఖర్ వ్రాసింది. రాజశేఖర్ రెండు సంవత్సరాల క్రితం అతని భార్య శ్యామలతో ఈ వూరు వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చాడు. నీరజను కలుసుకున్న నా కొద్దిమంది స్నేహితుల్లో అతనుకూడా ఒకడు.

"డియర్ నందా!

నువ్వు నీరజతో వైజాగ్ వస్తావని శ్యామల ఇంకా ఎదురు చూస్తూనే ఉంది. ప్రతి సారీ ఉత్తరం వ్రాయమని అంటూనే ఉంది. రోజులు ఎలా పరుగెడుతున్నాయో చూశావా? మేము వచ్చి అప్పుడే రెండేళ్ళు దాటిపోయాయి. మీ రైనా ఈ వైపు రాకూడదూ?

శ్యామలకు నీరజ చాలా నచ్చింది. నీకు చక్కటి తోడు దొరికినందుకు మా ఇద్దరికీ చాలా సంతోషంగా ఉంది.

ఈ రోజు ఈ ఉత్తరం వ్రాయడానికి ఒక కారణం ఉంది.

నీకు సౌమిత్రి జ్ఞాపకం ఉన్నాడు కదూ?"

నా గుండె నూరు మైళ్ళ వేగంతో పరుగెత్తింది. చెమటలు పట్టాయి. ఉత్తరంలో అక్షరాలు సరిగా కనుపించలేదు.

వూపిరి గట్టిగా పీల్చి, చెమట తుడుచుకున్నాను. ఉత్తరం మళ్ళీ చదవడం మొదలు పెట్టాను.

ఈ సారి అక్షరాలు కనుపించాయి.

"నీకు సౌమిత్రి గుర్తు ఉన్నాడు కదూ? వారం రోజుల క్రితం హటాత్తుగా కనుపించాడు. పిచ్చివాడి రూపంలో ఉన్నాడు. జాలివేసింది. మా ఇంటికి తీసుకువెళ్ళాను. శ్యామల కాఫీ తీసుకు వచ్చింది. అంతవరకూ నాతో బాగానే మాట్లాడుతున్న వాడు శ్యామలను చూడగానే హటాత్తుగా వెర్రికేక పెట్టి, 'ఆమే నా సుకన్య!' అంటూ అరిచి ఫిట్‌లా వచ్చి క్రింద పడిపోయాడు. వెంటనే హాస్పిటల్లో అడ్మిట్ చేశాను. సౌమిత్రికి ఎప్పుడో తలకు గాయాలు తగిలినట్లున్నాయి. మెదడుకు దెబ్బ తగిలి అప్పుడప్పుడు ఇలా మతి భ్రమిస్తున్నదని 'న్యూరో ఫిజీషియన్' అన్నాడు. 'సైకియాట్రిస్టు' కూడా పరీక్షలు చేస్తున్నాడు. 'సుకన్య' గురించి ఇంకా వివరాలు చెప్పలేదు."

నేను ఉత్తరం పూర్తిగా చదవకుండానే "నీరజా!" అంటూ గావుకేక పెట్టాను.

నీరజ అదురుకుంటూ పరుగెత్తుకుని వచ్చింది. నీరజను అమాంతం నా చేతుల్లో చుట్టేసి గాఢంగా కౌగిలించుకున్నాను.

"న...నందా!"

"నీరూ... నువ్వు నా దానివే! నా దానివే!" అంటూ పిచ్చిగా నీరజను ఎత్తుకుని గిరగిరా తిప్పేశాను.

నాకు పోయిన ప్రాణం ఉరకలు వేస్తూ తిరిగి వచ్చింది. నాలో ఉడుకురక్తం చిందులు తొక్కుతూ ప్రవహించింది. నీరజను ఆనందంతో ఉక్కిరి బిక్కిరి చేశాను. ఆమె మీద ముద్దుల వర్షం కురిపించాను.

నా ఆవేశం చల్లారాక నేను పకపకా నవ్వుతూంటే గాలికి ఎగురుతూ నేల మీద దొర్లుతున్న ఉత్తరాన్ని నీరజ అందుకొని చదివింది. ఉత్తరమంతా చదివి నా కేసి ప్రశ్నార్థకంగా చూసింది.

"వాడు ఆ రోజు మన ఇంటికి వచ్చాడు. నీ... నీ ఫోటో చూచి 'ఆమే నా సుకన్య' అన్నాడు" అంటూ అంతా చెప్పుకు వచ్చాను.

"అతని మాటలు నిజం అనుకుని నేనే 'సుకన్య' ననుకున్నావా? అందుకేనా ఇన్ని రోజులూ నిలో నువ్వు కుళ్ళి కుళ్ళి చిత్రవధ అనుభవించావు? నా పిచ్చి నందా! నన్ను ఒక్క మాట అడిగి ఉండ కూడదా?" బాధగా అన్నది నీరజ.

"ఏమని అడగమన్నావ్? 'నువ్వు నాకోసం మళ్ళీ జన్మ ఎత్తా' వన్న నోటితోనా" అని అడిగాను.

"నీకు సౌమిత్రి తెలుసా? అని మూడుముక్కల్లో ఒకే ఒక్క ప్రశ్న అడిగి ఉండవచ్చే? కానీ, నువ్వు అడగలేదు. అడగలేకపోయావు, ఎందుకో తెలుసా?" అన్నది నీరజ.

అవునన్నట్లు తల ఆడించాను.

"భయంచేత ... నా గత చరిత్ర ఏమిటో తెలియక ఏమేమిటో వూహించుకుని ఉంటావు అవునా?" అన్నది నీరజ.

"పోనీలే, నీరూ! జరిగినదంతా ఒక పీడకల అనుకుంటాను. నిన్ను కష్టపెట్టిఉంటే నన్ను క్షమించు" మనసారా అన్నాను.

"నా గత చరిత్ర ఇప్పటికైనా తెలుసుకోవాలని లేదా?" అని అడిగింది నీరజ.

నీరజకేసి కొన్ని క్షణాలు దీక్షగా చూచి ఉంటాను.

"నో!" అన్నాను.

"నందా!"

"నన్ను వివాహం చేసుకోక మునుపు ఒకసారి నీ గత చరిత్ర వినిపిస్తానన్నావు. అప్పుడు కూడా వద్దన్నాను. అప్పుడు వద్దని ఎందుకన్నానో ఇప్పుడు కూడా అందుకే వద్దంటున్నాను" దృఢంగా అన్నాను.

"భవిష్యత్తులో మరో సౌమిత్రి వచ్చి 'ఆమె నా సుకన్య' అని నన్ను చూపించి అన్నా డనుకో!" అని నీరజ అన్నది.

"అననీ!"

"మళ్ళీ ఈ తీరని వ్యథ అనుభవిస్తావా?" అన్నది నీరజ.

కాస్సేపు కళ్ళు మూసుకుని ఆలోచించాను.

"గివ్ మి ఎనదర్ ఛాన్స్, నీరూ!" అన్నాను.

"ఓహో నందా! మై హాట్సాఫ్ టు యు!" అన్నది నీరజ.

నా ఆశయం నెరవేర్చుకున్నందుకు నేను మరో జన్మ ఎత్తా ననుకున్నాను. ★

---

## 'ఆశ'యాలు

ఆరోగ్యం ఉన్న వానికే ఆశ ఉంటుంది. ఆశ ఉన్నవానికి అన్ని ఉంటాయి.

— ఆరేబియన్ సామెత

## సత్యవాణి

హృదయన్ని మించిన దైవజ్ఞుడు, జ్యోతిష్కుడు లేడు. హృదయం ఎప్పుడు సత్యాన్నే చెబుతుంది.

— కార్ల్యారన్